## క్లుప్తంగా

### అవార్డు గ్రహీతకు ఘన సన్మానం



మహమ్మదాబాద్: పద్యనాటక, జానపద కళలలో మేటి అయిన మాలెల అంజిలయ్యగౌడ్‌కు ప్రభుత్వం ఇటీవల కీర్తి పురస్కారం అందించింది. దీంతో బుధవారం మండలంలోని ఓ ప్రైవేట్ కళాశాల యాజమాన్యం ఆయనను సన్మానించింది. మాజీ డీసీసీబీ చైర్మన్ రుద్రారెడ్డి మాట్లాడుతూ ఉపాధ్యాయుడుగా ఉంటూ గ్రామీణ ప్రజలకు పౌరాణిక నాటకాలు, పద్యనాటకాలు, జానపద గీతాలు రేడియో సంగీతాలు సైతం అందించిన ఘనత అంజిలయ్యదేనని కొనియాడారు.

### కల్తీకల్లు బాధితులను ఆదుకోవాలి



స్టేషన్ మహబూబ్‌నగర్: కల్తీకల్లు వల్ల మృతి చెందిన వారి కుటుంబాలకు ఆర్థికసాయం చేయాలని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఎస్.వినోద్‌కుమార్ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మంత్రి ఇలాఖాలో కల్తీకల్లు వ్యాపారం విచ్చలవిడిగా ఏరులై పారుతుందని ఆరోపించారు. కల్తీకల్లు తాగి అస్వస్థతకు గురై చికిత్స పొందిన వారికి మెరుగైన వైద్యం అందజేయాలన్నారు. ఈ చావులకు మంత్రి బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. అసెంబ్లీ నియోజకవర్గంలో కల్తీకల్లు వ్యాపారాన్ని అక్రమంగా నిర్వహిస్తున్నారని అన్నారు.

### సీపీఎస్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): సీపీఎస్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని సీపీఎస్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు బాలస్వామి కోరారు. బుధవారం కలెక్టరేట్‌లోని వివిధ శాఖల సీపీఎస్ ఉద్యోగులను కలిశారు. ఈనెల 16వ తేదీన నిర్వహించనున్న ర్యాలీ కరపత్రాలను పంపిణీ చేశారు. అనంతరం కలెక్టర్ రవినాయక్‌కు సీపీఎస్ ఉద్యోగుల డైరీని అందజేశారు. కార్యక్రమంలో చంద్రకాంత్, వెంకటయ్యగౌడ్, కర్ణయ్య, శ్రీధర్, కుర్మయ్య పాల్గొన్నారు.

### ప్రభుత్వాల వైఫల్యాలను ఎండగట్టాలి



మహబూబ్‌నగర్ రూరల్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఫల్యాలను ప్రజలు ఎండగట్టాలని టీపీసీసీ ఉపాధ్యక్షుడు ఒబేదుల్లా కొత్వాల్ అన్నారు. బుధవారం మండలంలోని ఫతేపూర్‌లో హాథ్ సే హాథ్ జోడో యాత్రలో భాగంగా టీపీసీసీ ఉపాధ్యక్షుడు, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి సంజీవ్ పర్యటించారు. గ్రామంలో తిరుగుతూ ప్రజల కష్టసుఖాలను తెలుసుకుంటూ, గతంలో పార్టీ చేసిన కార్యక్రమాలను వివరించారు. పేద ప్రజలకు అండగా ఉంటామని భరోసానిచ్చారు. కార్యక్రమంలో మల్లు నర్సింహారెడ్డి, సిరాజ్‌ఖాద్రి, బెక్కరి అనిత, శ్రీనివాస్‌గౌడ్, సుధాకర్‌రెడ్డి, రామచంద్రయ్య, బాలస్వామి, ఫక్రూ ద్దీన్, ఫహీమ్, చంద్రమౌళి, చెన్నయ్య, భాస్కర్, రజాక్, నరేష్, అంజి, ఖాజా పాల్గొన్నారు.

**చిన్నఆదిరాలలో హాథ్‌సే హాథ్ జోడో యాత్ర**

జడ్చర్ల: మండలంలోని చిన్న ఆదిరాలలో బుధవారం హాథ్‌సే హాథ్ జోడో యాత్రను మాజీ ఎమ్మెల్యే ఎర్ర శేఖర్ చేపట్టారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజ లకు వివరించారు. కార్యక్రమంలో జనార్దన్‌రెడ్డి, వెంకటయ్య, మినాజ్ పాల్గొన్నారు.

### నర్సింగ్ విద్యార్థుల ఫ్రెషర్స్ పార్టీ

పాలమూరు: జిల్లా జనరల్ ఆస్పత్రిలోని సమావేశ మందిరంలో బుధవారం ప్రభుత్వ నర్సింగ్ కళాశాల విద్యార్థులకు ల్యాంప్ లైటింగ్, ఫ్రెషర్స్ పార్టీ నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలలో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ రామకిషన్, నర్సింగ్ కళాశాల ప్రిన్సిపాల్ స్వరాజ్యలక్ష్మి పాల్గొన్నారు.

### కంటివెలుగు పేదలకు వరం

కోయిల్‌కొండ: కంటివెలుగు పేదలకు వరమని ఎంపీపీ శశికళ అన్నారు. బుధవారం మండలంలోని బొజానిగుట్టతండాలో కంటి వెలుగు శిబిరాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ జయరాములు, సర్పంచ్ నారాయణ తదితరులు పాల్గొన్నారు.

# పంచాయతీ కార్యదర్శుల సంబరం



హన్వాడలో కేక్‌కట్ చేస్తున్న జూనియర్ పంచాయతీ కార్యదర్శులు

మహబూబ్‌నగర్ రూరల్: జూనియర్ పంచాయతీ కార్యదర్శులుగా విధుల్లో చేరి నాలుగు ఏళ్ల పూర్తి కావడంతో మండలంలో బుధవారం మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేశ్వర్‌గౌడ్, ఎంపీపీ సుధాశ్రీ ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కార్యదర్శులు ప్రజాప్రతినిధులతో కేక్ కట్ చేయించి సంబరాలు చేశారు. అనంతరం ఎంపీపీ మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు గ్రామాల్లో సమర్థవంతంగా అమలు కావడంతో కార్యదర్శులు కీలక పాత్ర పోషిస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ జ్యోతి, ఎంపీఓ నరేందర్ రెడ్డి, సూపరింటెండెంట్ గోవింద్‌రెడ్డి, కార్యదర్శులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా ప్రభుత్వం నిర్ణయించిన 4ఏళ్ల గడువు పూర్తయినప్పటికీ జూనియర్ కార్యదర్శుల రెగ్యులరైజేషన్ గురించి ఇప్పటికీ ఎటువంటి ఉత్తర్వులు వెలువడనందున మా విన్నపాన్ని ముఖ్యమంత్రి కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లాలని కోరుతూ వినతిపత్రాలు సమర్పించారు.



జిల్లా కేంద్రంలో రెగ్యులరైజేషన్ కోసం వినతిపత్రం అందజేస్తున్న కార్యదర్శులు

**కార్యదర్శులను క్రమబద్ధీకరణ చేయండి**

కోయిల్‌కొండ: నాలుగేళ్లుగా విధులు నిర్వహిస్తున్న కార్యదర్శులను క్రమబద్ధీకరించాలని బుధవారం మండలంలోని ప్రజాపరిషత్ కార్యాలయంలో ఎంపీపీ శశికళ, జెడ్పీటీసీ విజయ్‌భాస్కర్‌రెడ్డి, ఎంపీడీఓ జయరాములుకు వినతిపత్రం సమర్పించారు. నంద కిశోర్, నరేష్, ప్రవీణ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

అడ్డాకుల: తమను ప్రభుత్వం వెంటనే క్రమబద్ధీకరించాలని జూనియర్ పంచాయతీ కార్యదర్శులు విజ్ఞప్తి చేశారు. అడ్డాకుల, మూసాపేట మండల కేంద్రాల్లో కార్యదర్శులు బుధవారం సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. అడ్డాకులలో ఎంపీపీ నాగార్జున్‌రెడ్డి, మూసాపేటలో జెడ్పీటీసీ ఇంద్రయ్య సాగర్, ఎంపీపీ కళావతిని సత్కరించారు. కార్యక్రమాల్లో ఎంపీడీఓలు మంజుల, స్వరూప, ఎంపీఓలు విజయకుమారి, సరోజ, జయన్నగౌడ్, పాల్గొన్నారు.

దేవరకద్ర: పంచాయతీ కార్యదర్శులు బుధవారం ఎంపీపీ రమాదేవి, ఎంపీడీఓ శ్రీనివాసులు, ఎంపీఓ శ్రీనివాస్‌రెడ్డిలకు వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా మండల పరిషత్ కార్యాలయం వద్ద కార్యదర్శులు కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో శివ, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

హన్వాడ: జూనియర్ పంచాయతీ కార్యదర్శులు బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో కేక్‌కట్ చేశారు. కార్యక్రమానికి ఎంపీపీ బాల్‌రాజు హాజరయ్యారు. రెగ్యులరైజ్ చేయాలని పంచాయతీ కార్యదర్శులు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ధనుంజయగౌడ్, రమణారెడ్డి, ఎంపీఓ వెంకటరెడ్డి, మన్నన్, కార్యదర్శులు పాల్గొన్నారు.



కోయిల్‌కొండలో..



దేవరకద్రలో..



అడ్డాకులలో..

### 14న క్రికెట్ టోర్నీ

జడ్చర్ల: స్థానిక పత్తి మార్కెట్ యార్డు సమీపంలో ఈనెల 14న చంద్రారెడ్డి మెమోరియల్ క్రికెట్ టోర్నమెంట్స్ నిర్వహిస్తున్నట్లు నిర్వాహకుడు తిరుపతి రెడ్డి బుధవారం ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి జిల్లా నుంచి టీమ్‌లు రిజిస్ట్రేషన్ చేయించుకునేందుకు 9985375737ను సంప్రదించాలని కోరారు.

### చలివేంద్రం ప్రారంభం

అడ్డాకుల: మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో బుధవారం చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ప్రగతి స్పిన్నింగ్ ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఎస్‌ఐ మాధవరెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో జీఎం శ్రీనివాసన్, వెంకట్రాములు, వెంకటయ్యగౌడ్, అజయ్ కుమార్ తదితరులు ఉన్నారు.

హన్వాడ: తహసీల్దార్ కార్యాలయ ఆవరణంలో రేషన్‌డీలర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని తహసీల్దార్ బక్కశ్రీనివాసులు బుధవారం ప్రారంభించారు. కార్యక్రమంలో ఎఫ్‌ఏసీఎస్ చైర్మన్ వెంకటయ్య, డీటీ సతీష్, ఆర్‌ఐ సాధిక్, రాజు, రాములు పాల్గొన్నారు.

### నేడు గాధిర్యాల్‌లో కంటివెలుగు శిబిరం

మహమ్మదాబాద్: ప్రభుత్వం గ్రామీణ ప్రజల కోసం ఏర్పాటు చేస్తున్న కంటి వెలుగు శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కార్యదర్శి హాజి తెలిపారు. గురువారం గాధిర్యాల్‌లో కంటి వెలుగు శిబిరాన్ని ప్రారంభించనున్నట్లు తెలిపారు. ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు.

### ఇసుక టిప్పరు పట్టివేత

మిడ్జిల్: మండలంలోని కొత్తపల్లి శివారులో దుందుబీ వాగు నుంచి అనుమతి లేకుండా మంగళవారం రాత్రి ఇసుక తరలిస్తున్న టిప్పరును పట్టుకున్నట్లు ఎస్‌ఐ రామ్‌లాల్‌నాయక్ తెలిపారు. డ్రైవర్ పాండునాయక్‌పై కేసు నమోదు చేశామన్నారు.

### వ్యతిరేక నిర్ణయాలు మానుకోవాలి

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: ప్రభుత్వం విద్యార్థి వ్యతిరేక నిర్ణయాలు తీసుకోవడం మానుకోవాలని ఏబీవీపీ నాయకులు డిమాండ్ చేశారు. పీయూ ముఖ ద్వారం వద్ద బుధవారం నిరసన చేపట్టారు. పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నరేష్, తేజ, శోభన్ తదితరులు పాల్గొన్నారు.

### మత్స్యసహకార సంఘాలను ఆదుకోండి

మహమ్మదాబాద్: మండలంలో మత్స్య సహకార సంఘాల అభివృద్ధికి సహకారం అందించాలని శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండప్రకాష్‌ను కోరారు. మండల కేంద్రానికి చెందిన మత్స్య సహకార సంఘం ఆధ్వర్యంలో బుధవారం ఆయనను కలిసి వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో నర్సింహులు, కేశవులు, బచ్చయ్య, కేశవులు, అంజి తదితరులు ఉన్నారు.

### బాధిత కుటుంబాలకు ఎమ్మెల్యే పరామర్శ

దేవరకద్రరూరల్: మండలంలోని గద్దెగూడెంలో పది రోజుల క్రితం అనారోగ్య కారణాలతో చిన్న రాములు, వెంకటేష్ మృతి చెందారు. బుధవారం గ్రామానికి వెళ్లిన ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి బాధిత కుటుంబసభ్యులను పరామర్శించారు. ఆయన వెంట పీఏసీఎస్ చైర్మన్ నరేందర్‌రెడ్డి, జెట్టి నర్సింహారెడ్డి, శ్రీకాంత్‌యాదవ్, భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## మిషన్‌భగీరథ అధికారుల పనితీరుపై ఆగ్రహం



సభలో మాట్లాడుతున్న అధికారులు

కోయిల్‌కొండ: మిషన్ భగీరథ అధికారులు తాగు నీటి సరఫరాలో నిర్లక్ష్యం చేస్తున్నారని బుధవారం మండల సర్వసభ్య సమావేశంలో ప్రజాప్రతినిధులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎంపీపీ శశికళ అధ్యక్షతన ఏర్పాటు చేసిన మండల సమావేశంలో ప్రజాప్రతినిధులు తమ సమస్యలను సభ దృష్టికి తీసుకొచ్చారు. మిషన్ భగీరథలో పనిచేసే అధికారులకు ఎన్నిసార్లు విన్నవించిన నీటి సరఫరాను పట్టించుకోవడంలేదని కొత్లాబాద్ ఎంపీటీసీ సత్యయ్యగౌడ్ ఆరోపించారు. పైపుల లీకేజీ అధికంగా ఉండడం కారణంగా నీరు పచ్చగా వస్తున్నాయన్నారు. ఆ నీటిని తాగితే రోగాలు తప్పవని మండిపడ్డారు. అధికారులు చొరవ తీసుకొని రోజు వారీగా మంచినీటిని ప్రజలకు అందించాలని సభలో అధికారులను కోరారు. అనంతరం ఆయాశాఖల పనితీరుపై అధికారులు ప్రజాప్రతినిధులకు వివరించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ విజయ్‌భాస్కర్‌రెడ్డి, ఎంపీడీఓ జయరాములు, తహసీల్దార్ ప్రేమ్‌రాజ్, సర్పంచ్‌లు కరుణాకర్‌రెడ్డి, మొగులయ్య, సింగిల్ విండో చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

## మాలల స్ఫూర్తి భవన నిర్మాణ కమిటీ ఎన్నిక



మాట్లాడుతున్న అంజనేయులు

మహబూబ్‌నగర్ రూరల్: డాక్టర్ బీఆర్ అంబేద్కర్ మాలల స్ఫూర్తి భవన నిర్మాణ కమిటీ కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. బుధవారం స్థానిక ఎస్సీ కమ్యూనిటీహాల్‌లో మాల సంఘాల నాయకులు సమావేశమై కమిటీ చైర్మన్‌గా మంత్రి నర్సింహయ్యను ఎన్నుకున్నారు. కన్వీనర్లుగా కాడం బాలరాజు, కంచిమి లక్ష్మణ్, వైస్ చైర్మన్లుగా ఎడ్ల కృష్ణయ్య, మూలే కేశవులు, బ్యాగరి వెంకటస్వామి, కానుగడ్డ యాదయ్య, చెన్నకేశవులు, ఎత్తపు కేశవులు, గుడ్ల రాజశేఖర్, కోఆర్డినేటర్లుగా రాఘవేందర్, డబ్బా రాములు, కోకన్వీనర్లుగా చిన్న, గోపాల్, యాదయ్య, రవికుమార్, వెంకట్రాములు, సలహాదారుగా మూడా డైరెక్టర్ కాడం ఆంజనేయులును ఎన్నుకున్నారు. అంబేద్కర్ మాలల స్ఫూర్తి భవనం కోసం స్థల కేటాయింపులో అర్బన్ తహసీల్దార్ పార్థసారథి చూపిన చొరవ మాల జాతి ఎప్పటికీ మరవదన్నారు. సమావేశంలో కర్ణ, శ్యామ్ సుందర్, రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఇఫ్తార్‌లో డీకే అరుణ, జూపల్లి



ఇఫ్తారులో పాల్గొన్న మాజీ మంత్రులు, నాయకులు

స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లా కేంద్రంలోని ఓ ఫంక్షన్‌హాల్ బుధవారం సాయంత్రం సామాజిక వేత్త జఫరుల్లా సిద్దిఖీ ఇఫ్తార్ ఏర్పాటు చేశారు. అనంతరం మతపెద్ద దువా చేశారు. విందులో మాజీ మంత్రులు డీకే అరుణ, జూపల్లి కృష్ణారావు, చంద్రశేఖర్‌రావు, టీపీసీసీ ఉపాధ్యక్షుడు ఒబేదుల్లా కొత్వాల్ తదితరులు పాల్గొన్నారు. ముస్లింలకు పండ్లు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు వీరబ్రహ్మచారి, ఎన్పీ వెంకటేష్, పాండురంగారెడ్డి, జాబెర్ బిన్ సయీద్, సయ్యద్ ఇబ్రహీం పాల్గొన్నారు. కాగా డీకే అరుణ, జూపల్లి కృష్ణారావు పాలమూరులో ఇఫ్తార్‌కు హాజరుకావడం జిల్లాలో ప్రస్తుతం చర్చనీయాంశమైంది.

బాలానగర్: మండల కేంద్రంలో బుధవారం పీసీసీ కార్యదర్శి అనిరుధ్‌రెడ్డి ముస్లింలకు ఇఫ్తార్ ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ అన్ని మతాల వారికి స్వేచ్ఛ కేవలం కాంగ్రెస్‌తోనే సాధ్యమని ఆయన వివరించారు. ఆయన వెంట ఆంజనేయులు, కుమార్, శివ తదితరులు ఉన్నారు.



జయరామ షోరూం ఆధ్వర్యంలో..

**జయరామ షోరూం ఆధ్వర్యంలో..**

పాలమూరు: శ్రీరామ-జయరామ ఆటోమోటివ్స్ సంస్థల ఆధ్వర్యంలో బుధవారం మహీంద్రా ట్రాక్టర్ షోరూంలో ముస్లింలకు ఇఫ్తార్ ఇచ్చారు. ఈ సందర్భంగా సంస్థల అధినేత బెక్కరి రాంరెడ్డి మాట్లాడుతూ ప్రతి ఏడాది ముస్లింలకు ఇఫ్తార్ ఇస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సేల్స్ మేనేజర్ మహమూద్ యాకూబ్, సీఈఓ విక్రమ్, వేణుగోపాల్, శ్రీనివాస్ రాజమూర్తి పాల్గొన్నారు.

## ముస్లింలకు రంజాన్ గిఫ్ట్‌లు

మహబూబ్‌నగర్ రూరల్: రంజాన్ పండుగ సందర్భంగా ప్రభుత్వ ఆధ్వర్యంలో గురువారం పట్టణంలో ముస్లింలకు రంజాన్ గిఫ్ట్‌ల పంపిణీ, ఇఫ్తార్ ఏర్పాటు చేయనున్నట్లు అర్బన్ తహసీల్దార్ పార్థసారథి తెలిపారు. ఉదయం 10గంటలకు హెచ్‌బీ గార్డెన్, 10:30 గంటలకు కమాల్ గార్డెన్, 11 గంటలకు రోజ్ గార్డెన్‌లలో మంత్రి శ్రీనివాస్‌గౌడ్, కలెక్టర్, ఎస్పీలతో కలిసి రంజాన్ గిఫ్ట్‌లు పంపిణీ చేస్తారని పేర్కొన్నారు. సాయంత్రం 6:15 గంటలకు ప్రభుత్వ ఆధ్వర్యంలో హెచ్‌బీ గార్డెన్‌లో, నేషనల్ గార్డెన్ ఫంక్షన్‌హాల్‌లో ఇఫ్తార్ ఏర్పాటు చేశామని, ముస్లింలు హాజరుకావాలని, ఇందులో మంత్రితో పాటు ఇతర ప్రజాప్రతినిధు లు, అధికారులు పాల్గొంటారని వెల్లడించారు.

## అభివృద్ధిని చూసి బీఆర్‌ఎస్‌ను ఆదరించాలి

మహబూబ్‌నగర్ రూరల్: అభివృద్ధిని చూసి మళ్లీ బీఆర్‌ఎస్‌ను ఆదరించాలని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేశ్వర్‌గౌడ్ అన్నారు. బుధవారం మండలంలోని కోడూర్‌లో వందమంది ఓటర్ల ఇన్‌చార్జ్‌లతో కలిసి ఆయన ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం నుంచి ఏమేమి పథకాలు అందుతున్నాయో అడిగి తెలుసుకున్నా రు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు ప్రజలకు వివరించాలని అన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వాన్ని బద్నాం చేసే పనిలో బీజేపీ ఉందని, కాంగ్రెస్ బీజేపీ వంత పాడుతుందని అన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ శ్రీకాంత్‌గౌడ్, కరుణాకర్‌గౌడ్, హరిజన వెంకటయ్య, ఆంజనేయులు, సురేష్, ఆశన్న, రాములుగౌడ్, చిన్న నాగన్నగౌడ్ పాల్గొన్నారు.

## ఇబ్బందులున్న చోట కొత్త బోర్లు



పనులు ప్రారంభిస్తున్న ప్రజాప్రతినిధులు

గండీడ్: తాగునీటికి ఇబ్బందులు ఉన్న గ్రామాల్లో మండల నిధుల నుంచి కొత్తగా బోర్లు వేయించేందుకు తాము సిద్ధంగా ఉన్నామని జెడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. బుధవారం మండలంలోని కొండాపూర్‌లో మిషన్ భగీరథ నీరు సరిగా రానందున, ప్రజలకు నీటికి ఇబ్బందులు కాకుండా కొత్తగా బోరు డ్రిల్లింగ్ ప్రాంభించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం తాగునీటికి వినియోగానికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా మిషన్ భగీరథ ద్వారా ప్రతి గ్రామానికి సరిపడ నీరు అందిస్తున్నారని తెలిపారు. కొన్ని గ్రామాల్లో ఇబ్బందుల వల్ల తక్కువగా నీరు వస్తున్న గ్రామాలకు మండల నిధుల నుంచి బోర్లు వేయిస్తున్నట్లు తెలిపారు.

## 'సామాజిక సేవ చేయడం అదృష్టం'

నారాయణపేట రూరల్ : సామాజిక సేవా కార్యక్రమాలను లయన్స్‌క్లబ్ ద్వారా చేయడం ఎంతో అదృష్టంగా భావిస్తున్నట్లు డిస్ట్రిక్ట్ గవర్నర్లు జూలూరి రఘు, హరినారాయణ్‌బట్టడ్ పేర్కొన్నారు. టౌన్ లయన్స్‌క్లబ్ కమిటీ ఏర్పాటై ఏడాది పూర్తయిన సందర్భంగా సభ్యులు చేసిన సేవా కార్యక్రమాల పరిశీలనకు బుధవారం నిర్వహించిన చార్టెడ్ నైట్ కార్యక్రమంలో వారు పాల్గొని రికార్డులు పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ.. తక్కువ సమయంలో ఎక్కువ కార్యక్రమాలను చేపట్టడంపై అభినందించారు. భవిష్యత్‌లో మరిన్ని కార్యక్రమాలు చేపట్టాలని కోరారు. అదేవిధంగా లయన్ భవన్‌లో కొనేళ్లుగా మహిళలకు కుట్టు మిషన్ నేర్పిస్తూ రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన నాగేశ్వరీ కుమారుడికి ఉన్నత చదువులకు రూ.45వేల చెక్కును అందించారు. అశోక్‌నగర్ పాఠశాలలోని చిన్నారులకు బ్యాగులను ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో వేణు, సురేష్, సూర్యప్రకాష్, స్థానిక అధ్యక్షులు మొల్గాన్‌జనార్దన్, సెక్రెటరీ సాయినాథ్, కోషాధికారి రవికుమార్‌గౌడ్, శ్రీనివాస్, భీంచందర్, గందెఉమాకాంత్, ఆత్మారాం, కన్నజగదీష్ పాల్గొన్నారు.

# ఆగని ఆర్టీసీ బస్సులు



రాజాపూర్ జాతీయ రహదారిపై బస్టాప్

- అవస్థలు పడుతున్న విద్యార్థులు
- పాసులు ఉన్నా నిరుపయోగమేనని ఆవేదన

రాజాపూర్: జాతీయ రహదారిపై ప్రయాణికుల కోసం చక్కటి బస్టాండ్‌లు నిర్మించారు. కానీ ఆర్టీసీ బస్సులో వెళ్లాలంటే మాత్రం గంటల తరబడి వేచి ఉండాల్సిందే. కారణం హైవేపై బస్సులు నిలపక పోవడం. దీంతో మండల కేంద్రంలో విద్యార్థులు, వ్యాపారస్తులు, ప్రజలు పనులపై ఇతర ప్రాంతాలకు వెళ్లాలంటే తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఉమ్మడి బాలానగర్ మండలం నుంచి కొత్తగా ఏర్పాటైన రాజాపూర్ మండల కేంద్రంలో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని అన్ని డిపోల బస్సులను నిలపాలని ఎన్నో పర్యాయాలు ప్రజాప్రతినిధులకు, ఆర్టీసీ అధికారులకు వినతిపత్రాలు అందజేశారు. అయినా సమస్య మాత్రం పరిష్కారం కావడంలేదు. మండల కేంద్రంతో పాటు చుట్టుపక్కల గ్రామాల నుంచి ఉద్యోగులు, వ్యాపారస్తులు, విద్యార్థులు, సామాన్య ప్రజలు షాద్‌నగర్, జడ్చర్ల, మహబూబ్‌నగర్, హైదరాబాద్ పట్టణాలకు వివిధ పనులపై రాకపోకలు సాగిస్తుంటారు. ఆర్టీసీ బస్సులు ఆపకపోవడంతో ప్రైవేట్ ఆటోలు, జీపులలో ప్రయాణించక తప్పడంలేదు. ఆర్టీసీ సంస్థ విద్యార్థుల కోసం పాసులు ఇచ్చిన బస్సులు ఆపకపోవడంతో అవి ఉన్నా లాభం లేదని విద్యార్థుల తల్లిదండ్రులు వాపోతున్నారు. మండల కేంద్రంలో కేవలం మహబూబ్‌నగర్, నారాయణపేట డిపోల బస్సులు మాత్రమే అవి కూడా డ్రైవర్‌లు తమ ఇష్టం ఉంటేనే ఆపుతారని మిగతా బస్సులు అస్సలు ఆపకుండా వెళ్తున్నారని ప్రయాణికులు తెలుపుతున్నారు.

**ఉచితపాసులు ఇచ్చినా లాభం లేదు**



మండల కేంద్రంలో ఒక్క బస్సు కూడా ఆపడం లేదు. పల్లెవెలుగు బస్సులున్నా వెళ్లేవాళ్లం. అవి అసలుకే రావడ లేదు. విద్యార్థులకు బస్ పాసులు ఇచ్చిన అవి పనికి రావడంలేదు. మేము కళాశాలకు వెళ్లాలంటే ప్రైవేట్ ఆటోలు, జీపుల్లో వెళ్తున్నాం. పరీక్షలకు వెళ్లే విద్యార్థులు హాల్‌టికెట్ చూపి ఉచితంగా ఆర్టీసీ బస్సులో ప్రయాణం చేయొచ్చని విద్యాశాఖ మంత్రి ప్రకటించారు. కాని బస్సులే ఆపనప్పుడు ఏం లాభం.

– పవిత్ర, డిగ్రీ విద్యార్థిని, రాజాపూర్

**పాఠశాలకు వెళ్లాలంటే ఇబ్బందే..**



జిల్లా కేంద్రం నుంచి ప్రతిరోజు ఈద్గాన్‌పల్లిలో నేను పనిచేసే స్కూల్ దగ్గరికి వెళ్లాలంటే రాజాపూర్ మండల కేంద్రంలో మహబూబ్‌నగర్ డిపో బస్సు మాత్రమే ఆపుతారు. నాతో పాటు చాలామంది రాజాపూర్, బాలానగర్ మండలాల్లో ప్రభుత్వ పాఠశాలల్లో టీచర్లుగా పని చేస్తున్నాం. మాతోపాటు వివిధ శాఖల ఉద్యోగులు ఉదయం, సాయంత్రం రోజు బస్సులు ఆపక పోవడంతో గంటల తరబడి జాతీయ రహదారిపై వేచి ఉంటున్నాం. అన్ని డిపోల బస్సులు మండల కేంద్రంలో ఆపాలి.

– దుర్గాదేవి, ఉపాధ్యాయురాలు

**బస్సులు ఆపేలా చూస్తాం..**

రాజాపూర్‌లో మహబూబ్‌నగర్ డిపోకు చెందిన అన్ని ఎక్స్‌ప్రెస్ బస్సులు ఆపేలా చర్యలు తీసుకున్నాం. వనపర్తి, గద్వాల్ డిపోలతో పాటు హైదరాబాద్-1, 2 డిపోల బస్సులు కూడా రాజాపూర్‌లో ఆపేలా ఆచా డిపో మేనేజర్‌లకు తెలియజేస్తాం. గతంలో బస్సులు ఆపడంలేదంటు గ్రామస్తులు, విద్యార్థుల తల్లిదండ్రులు మాకు ఫిర్యాదు చేయడంతో అన్ని బస్సులను ఆపేలా చర్యలు తీసుకున్నాం.

– సుజాత, ఆర్టీసీ డీఎం, మహబూబ్‌నగర్ డిపో

### బలగం సినిమా ప్రదర్శన

మహమ్మదాబాద్: ఉమ్మడి కుటుంబాలు, సాంప్రదాయాలు, బంధుత్వాలు పల్లె సాంప్రదాయాలను తెలిపే బలగం సినిమా అన్ని పల్లెల్లో పాకిపోతున్నది. బుధవారం రాత్రి మండలంలోని నంచర్లలో కోట, పేటలో సర్పంచ్ అనసూయ ఆధ్వర్యంలో రెండుచోట్ల ఒకేసారి సినిమాను ప్రదర్శించారు. గ్రామస్తులు వందలాదిగా అక్కడికి చేరుకుని తిలకించారు. ఈ సినిమా కుటుంబ బాధ్యతలు, బంధుత్వం కలిసికట్టుగా చేసే కార్యాల గురించి ఎంతో మంచిగా చెప్పినట్లు ప్రజలు తెలిపారు.